## అందమంటే శారీరక సౌందర్యమా, స్వభావమా?

హాస్పిటల్ చర్చి గడియారం తొమ్మిది సార్లు మ్రోగింది. నిస్పృహగా బెడ్ మీద పక్కకి వత్తిగిల్లేను!

ఈ పూట కూడా రాధ నన్ను చూడ్డానికి రాలేదు.

రాదు కూడా!

అయినా ఎక్కడో కొనవూపిరి లాంటి ఆశ ఆమెకోసం నన్ను ఎదురు చూసేలా చేస్తోంది!

# అందమంటే సుషా


మన్నెం శారద

అది జనరల్ వార్డు!

రకరకాల రోగులు అనేక రకాలుగా బాధపడుతూ అటూ ఇటూ అసహనంగా పొర్లుతున్నారు.

అయినా వాళ్ళు ఒకవిధంగా నాకన్నా అదృష్టవంతులనే చెప్పుకోవాలి! విజిటింగ్ అవర్స్‌లో వాళ్ళకోసం ఎవరికి తగినంత ఆప్యాయతని వారు మూటగట్టుకొని ఎవరో ఒకరు వచ్చి పరామర్శించడం ఈ వారం రోజుల్నుండీ నేను గమనిస్తోన్న విషయం.

ప్రతి పేషెంటు పగలంతా ఎంత బాధపడినా సాయంత్రం తమవారిని చూడగానే తమ బాధని మరచిపోయి వాళ్ళతో కబుర్లు చెబుతాడు. నాల్గవుతుందనగానే హాస్పిటల్ వాతావరణం మారిపోతుంది. అంతవరకు ఖచ్చితంగా పాటించబడ్డ రూల్స్ సడలిస్తారు. హాస్పిటల్ మెయిన్ గేట్లు విజిటర్సు కోసం బార్లా తెరుస్తారు!




గట్టు తెగినవాగులా జనం వాళ్ళవారికోసం వార్డులో జొరబడతారు పండో ఫలమో పట్టుకొని. అంతకుమించిన ప్రేమానురాగాల్ని మోసుకొచ్చే వాళ్ళ కళ్ళని చూడగానే పేషెంటుకి పెద్ద రిలీఫ్!

రాధ!

—ఆమెని నేను ఎంతగా ప్రేమించేను!

ఎంతగా ఆరాధించేను!

ఆమెకోసం-ఆమెను జీవితభాగస్వామిగా పొందేందుకు నేను నా తల్లిదండ్రుల్ని సహితం ఎదిరించేను.

ప్చ్! రాధ. ఆ సంగతులన్నీ యిప్పుడామెకు గుర్తులేవు.

జీవితాన్ని డబ్బుగా మార్చుకొంది. ఆ డబ్బుతో సుఖాలు కొనుక్కోవడం నేర్చుకొంది.

ఆమె శక్తికిమించిన డబ్బు ఖర్చుపెడుతోందని నాకు దుగ్ధలేదు.

చూసిందల్లా కొంటోందని బాధ లేదు!

అసలలాంటి హక్కులు ఆమెకు తనే కల్పించేడు!

షాజహాన్ బ్రతికుండగా భార్యని ఎలా చూసేడో నాకు తెలియదు! ముంతాజ్ చనిపోయేక మాత్రం తరతరాలు చెప్పుకొని తరించేలా పాలరాతి సమాధి కట్టించేడు!

నా కలాంటి కీర్తి కాంక్ష లేదు!

బ్రతికుండగానే రాధ కోరిన ప్రతి కోరికా తీర్చాలని అనుకొన్నాను.

అందుకే ఆమె కోసం అధునాతనమైన బంగళా కట్టించేను.

అందులో రాధ అభిరుచులన్నిటినీ అమర్చేను!





ముఖ్యంగా మా బెడ్ రూమ్‌కి, బాత్రూమ్‌కి లక్షలు ఖర్చు చేసేను !

"బాత్రూమ్‌కి లక్షలా" అని ఆశ్చర్యపోయిన వాళ్ళూ వున్నారు.

కాని.... ఈ రోజుల్లో దీని కింత ఖర్చని రూలేం లేదు !

అభిరుచి, ఆర్థిక పరిస్థితినిబట్టి వుంటాయి మనం పొందాలనుకొన్న వస్తువులు !

మొదట మా యిల్లు చూసి రాధ మూర్ఛపోయింది. రాధ మధ్యతరగతి కుటుంబం నుంచివచ్చింది. అయితేనేం? అపురూపమైన సౌందర్యం! దివినుండి దిగివచ్చిన దేవతలా వుండేది.

నిజానికి దేవతలెలా వుంటారో నా కు తెలియదు !

కాని రాధలాంటి అపురూప లావణ్య వతిని నేనదే ప్రథమంగా చూడటం ! ఆమె కళ్ళు, ముక్కు, పెదవులు, నడుము.... దేనికదే ప్రత్యేకత సంతరించుకొని మగ వాళ్ళ మతులు పోగొట్టేవి !

నీలిమని ప్రతిఫలించే ఆమె నల్లని వాలు జడ మగవారి మనసులకి ప్రేమపాశంలా తోచేది !

ఆమె కాలేజీలో అడుగు పెట్టగానే పెద్ద పోటీ ప్రారంభమైంది. "చదువు సంగతి దేవుడెరుగు. రాధని గెలవడమే తమ జీవిత ధ్యేయం" అనుకొన్నారు విద్యార్థులు !

పాఠాలు చెప్పటం తర్వాత చూడొచ్చు- రాధ దృష్టిలో పడితే చాలనుకొన్నారు చాలా మంది లెక్చరర్లు !

రాధని ఆకట్టు కోడానికి పెద్ద పోటీ ప్రారంభమయిందనే చెప్పాలి. ఎవరికి వాళ్ళం ఆమె దృష్టిలో పడాలని తెగ ప్రయత్నించేవాళ్ళం. ఎప్పుడూ జిడ్డోడుతూ టక్ కూడ సరిగ్గా చేసుకోకుండా—పెళ్ళయి పిల్లలున్న వయసుమీరిన లెక్చరర్సే ఆమె క్లాసులోకి వచ్చేక ట్రిమ్‌గా మేకప్‌అయివస్తోంటే యింక మాలాంటి కుర్రకారు సంగతి వేరే చెప్పాలా !

ఆరునెలలు ఆమె మహా అవస్థ పడిందనే చెప్పాలి. ఏదో ఒక సాకుతో అందరూ ఆమెను పలకరించే వాళ్ళే.

Sumitra

పొరబాటున పుస్తకం జారి క్రిందపడితే చాలు— అందించడానికి పదిచేతులు ఎగబాకేవి !

అయితే నేను పందెం గెలవడానికి సరిక్రొత్త పంథా అవలంబించేను !

నామీద నాకు నమ్మకం వుంది.

నాకు అందగాడిగా పేరుంది.

ఆ అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవటానికి తాతలనాడు సంపాదించిపెట్టిన తరగని ఆస్తి వుంది.

ఎంత గొప్ప వజ్రమైనా వెలుగు కిరణం సోకినప్పుడే తళుక్కుమంటుంది. అలాగే ఎంత గొప్ప అందమైనా డబ్బనే మేకప్ వేసుకొంటేనే రాణిస్తుంది. పొడవాటి ప్లిమత్ కారులో కాలేజీకి వచ్చే నన్ను రాధ గమనించక తప్పలేదు.

నేను రాధ అందాన్ని ఆశ్చర్యంగా పరిశీలించలేదు.

అసలు 'అదో అందమా!' అన్నట్లు నిర్లక్ష్యంగా చూపులు తిప్పుకొన్నాను.

అంతే!

ఆమె నన్ను మొదట ఆశ్చర్యంగానూ — తర్వాత ఆరాధనగానూ గమనించటం మొదలెట్టింది.

నా నిర్లక్ష్యవైఖరి ఆమెలో అహాన్ని దెబ్బకొట్టింది.

ఆమె నా వేపు అర్రులు చాస్తున్నకొలదీ నేను అందని చందమామనైపోతున్నాను.

ఆమెకి పిచ్చెక్కిపోతోంది.

ఆమె అంచనాకి అందకుండా నన్ను నేను నిగ్రహించుకొంటున్నాను.

నిగ్రహించుకోలేని రాధ ఫిజిక్స్ నోట్సు కావాలంటూ నాతో మాటకలిపింది.

తిరిగి యిచ్చేస్తూ చేయి తగిలించింది.

షాక్ తిన్న నన్ను చూసి తెలివిగా నవ్వింది.

అంతే!

ఇన్ని రోజుల బింకం సూర్యకిరణం సోకిన మంచులా కరిగిపోయింది. ఫిజిక్స్ నోట్సులోని రాధ రాసిన ప్రేమలేఖ నా అనుమానాల్ని పటాపంచలం చేసేసింది.

అలా రాధని నేను గెలుచుకున్నాను.

పెద్దవాళ్ళని ఎదిరించి మరీ వివాహం చేసుకొన్నాను.

వయసుమీరో—మనోవ్యాధితోనో లేక రెండింటితోనో నా తల్లిదండ్రులు సంవత్సరం తిరక్కుండానే వరుసగా ఈ లోకం వదిలి ఆస్తికి నన్ను వారసుణ్ణి చేసేరు!

అలా సంక్రమించిన ఆస్తికి రాధని వారసురాల్ని చేసి, ఆమె అందానికి నేను అధికారి నయ్యేను.

లక్షలుపోసి కట్టించిన ఎంత అందమైన బంగళా ఆమె పేరునపెట్టి డాక్యుమెంట్సు చేతికి అందించినపుడు ఆమె కళ్ళలో చిప్పిలిన వెలుగు....!

ఓహ్ ! ఎన్ని కోహినూర్ డైమండ్సు కుప్పగా పోసినా ప్రజ్వరిల్లని కాంతి! రాధ గొప్ప అందగత్తెకాని, ధనవంతురాలుకాదు!

ఈరోజు డబ్బుతో స్నానం చేస్తోన్న రాధ అందంలో క్లియోపాత్రాని మించిపోయిందని నా ఉద్దేశ్యం.

రకరకాల పండ్లరసాలతో-పన్నీటిస్నానాలతో, పారిస్ సెంట్లతో, పాము కుబుసాల్లాంటి చీరలతో దివినుండి దిగివచ్చిన దేవతలా తయారయింది.


రాధని నా పక్కన చూసి అసూయతో అలమటించే కళ్ళు ఎన్నో.

ఆ అసూయ నాలో గర్వాన్ని రేకెత్తించేది.

'ఈ అపురూప సౌందర్యవతి నా స్వంతం' అని అరవాలనిపించేది. అలా రాధని—పక్కన నేనున్న సంగతి కూడా మరచి పిచ్చిగా రెప్పవేయకుండా చూసే వాళ్ళలో మహేష్ ఒకడు.

మహేష్‌ని చూస్తే నాకు జాలి వేసేది!

పాపం! అతని భార్య ఆస్తిమంతురాలే!




చెక్కిన కందదుంపలా ఎర్రగానే వుంటుంది!

ఉన్న నాలుగున్నర అడుగుల శరీరాన్ని బాండేజ్ వేసినట్లు జరీ తాపడమున్న పట్టు చీరలతో చుట్టేసుకుంటుంది.

రకరకాల నగలన్నీ దిమ్మరించుకొన్నట్లు మెడనిండా దిగబోసుకొంటుంది.

సవరం పెట్టిన జడ కప్పని మింగిన పాములా వికృతంగా వుంటుంది.

ఆమెని చూసినవాళ్ళు వూపిరాడక గిలగిల లాడతారు!

ఆమె తెచ్చే లక్షల కట్నానికి ఆశపడి మహేష్ ఆమెని కట్టుకున్నాడు. ఆమె ఆస్తి, అతని ఆస్తి కలిపి అతన్ని సంఘంలో కోటీశ్వరుడిగా నిలబెట్టేయి!

అలాంటి బిజినెస్ మాగ్నెట్ నా భార్య వేపు వెర్రిచూపులు చూస్తున్నాడంటే నాకు నవ్వొస్తుంది.

• • • • •

"హి యీజ్ సఫరింగ్ ఫ్రమ్ ఇంటస్టయిన్ టి. బి. ఈ కేస్ షీట్ చూడు నీకే తెలుస్తుంది. పోతే యితనికి నిద్ర మాత్రలివ్వటం మరచిపోకు. లేకపోతే రాత్రంతా మన ప్రాణం తీస్తాడు."

నర్స్ మాటలకి నా ఆలోచనలనుంచి తేరుకొని అటువైపు చూసేను. ప్రొద్దుట నుంచీ డ్యూటీలో వున్న నర్సు మరో నర్సుకి పేషంట్సు వివరాలు పరిచయం చేస్తోంది.

"మళ్ళీ ప్రొద్దుటే వస్తావా సిస్టర్?" అన్నాను.

నర్స్ నా వేపు చిరాగ్గా చూసింది "ఏం నీకు చెప్పాలా?" అంది. విసుగ్గా "పాపం. ఏదో అడిగేడు. ఎందుకలా విసుక్కుంటావు? పేషంట్సుని బాధపెట్టడం మన వృత్తిధర్మం కాదు" అంది అవతలి నర్స్.

ఆమె నన్ కాబోలు! మెడనుంచి పాదాల వరకు నిండుగా వున్న పరికిణీ లాంటి గౌను ధరించింది. మెడలో క్రాస్ వ్రేళ్ళాడుతోంది. తలకి చుట్టిన గుడ్డ భుజాల దాకా వుంది. ఆమె తల అటుతిప్పి వుండడంతో ముఖం కన్పించడం లేదు.

డేటైమ్ నర్స్ విసుగ్గా "నీకేం తెలుసు. ఇతనెంతగా విసిగిస్తాడో. సంవత్సరంలో ఆరు నెలలు మన హాస్పిటల్లోనే మకాం. ఈయనగారికి కాలక్షేపానికి మనం కబుర్లు చెప్పాలట. ఈయనకా జబ్బు తగ్గదు. మనకీ పీడా పోదు" అంది మరో పేషెంటువేపు వెళ్ళిపోతూ.

ఆమె మాటలకి నాకు కోపం రాలేదు.

నాలోని ఆ సెన్స్‌టివ్‌నెస్‌ని రాధఎప్పుడో చంపేసింది. విసురుకోవటాలు, కసురుకోవటాలు, ఛీదరింపులు, హేళనలు—నాకు గత నాలుగేళ్ళుగా బాగా అనుభవమైపోయేయి!

దురదృష్టం ఎప్పుడు నా వెంటబడి ఈ జబ్బు రూపంలో నాలో ప్రవేశించిందో అప్పటినుండి నా పరిస్థితులు మారిపోసాగేయి!

ప్రేమపిచ్చిలో పడి ఎప్పుడయితే వున్నదంతా రాధచేతిలో పెట్టడం జరిగిందో ఆనాటినుండి ఆమెకు నేను పురుగులా కన్పించటం మొదలుపెట్టేను.

ఆమె కళ్ళు మహేష్‌మీద పడ్డాయి!

రోజురోజుకీ నేను రాధ పక్కన దివిటీ ముందు దీపం సెమ్మెలా వెలాతెలబోతున్నాను. పైగా ఈ జబ్బొకటి నన్ను చాలా తొందరగా కృంగదీసేసింది.

మనసులోని బాధని చంపుకోటానికి నేను గొంతులో పోసుకున్న మందు పేగుల్ని తినేసి నాకీ ఆస్తి వదిలేసి వెళ్ళింది.

ఇప్పుడు కళ్ళెదుట ఎన్ని వున్నా తినడానికి నేను అనర్హుణ్ణి.

మజ్జిగనీళ్ళు—మంచినీళ్ళే నా ఆహారం.

ఇలాంటి సమయంలో నేను ఆశించినట్లు రాధ నాకు సేవలు చేయలేదు. నేను ఊహించినట్లుగా నా కోసం విలవిలలాడిపోలేదు.

"హాస్పిటల్లో అయితే మీకు ట్రీట్‌మెంటు బాగా జరుగుతుం"దని చెప్పి ఈ మిషనరీ హాస్పిటల్లో జాయిన్ చేసింది.

స్పెషల్ రూమ్‌లో, పెద్ద డాక్టర్ల సమక్షంలో నా జబ్బు తగ్గడానికి రెండు నెలలు పట్టింది.

రాధ రోజూ సాయంత్రం వచ్చి నన్ను చూసి వెళ్తుండేది.

అలా వచ్చి వెళ్తోన్న రాధని చూస్తే నాకేదోలా అన్పించేది. రాధ రోజు రోజుకి అందంగా, ఆరోగ్యంగా ఎలా వుండగల్గుతోంది?

ఆమెకి భర్త అనారోగ్యంతో మంచాన పడ్డారన్న దిగులులేదా? అందుకు కారణం డిశ్చార్జి అయి యింటికి వెళ్ళేకగాని తెలియలేదు నాకు! అక్కడ "నాది" అనబడే యింట్లో మహేష్ స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. నేను వున్నాననే బెరకుకూడా లేకుండా రాధగదిలోంచి నవ్వులు అలల్లా తేలివచ్చి నా గుండెని చిల్లులు పొడుస్తున్నాయి!


మహేష్ ఏదో పలకరింపుగా నా యోగక్షేమాలడిగి వెళ్ళిపోయేడు!

మహేష్ వెళ్ళేక రాధని దగ్గరికి పిలిచేను.

వచ్చి ఎదురుగా మంచం మీద కూర్చుంది.

"రాధా! మహేష్ ఎందుకు వస్తున్నాడు మన ఇంటికి?" అన్నాను చాలా శాంతంగా.

రాధ విసురుగా చూసింది.




"ఫ్రెండ్స్ ఎందుకు వస్తారు? సుమిత్ర ఎందుకొస్తుంది? షీలా ఎందుకొస్తుంది? ప్రేమ్ ఎందుకొస్తాడు?" అంది.

నేను క్షణం మాట్లాడలేక పోయేను.

"అంటే.... మహేష్ వాళ్ళందరితో సమానమంటావు!" అన్నాను కాస్త కోపంగా.

"అంతే. ఆ పైన వూహించుకొంటే అందుకు నేను బాధ్యురాల్ని కాదు" రాధ లేచి వెళ్ళిపోయింది.

ఎందుకు అడిగేనా అని చాలసేపు సిగ్గుపడ్డాను.

నాకు తెలిసిపోయిందన్నాకి వాళ్ళిద్దరూ నా ఎదుటే బాహాటంగా తిరగడం ప్రారంభించేరు.

పిక్నిక్‌లు, పార్టీలు—సినిమాలు, షికార్లు నిర్విరామంగా కొనసాగిపోతున్నాయి.

నాలో కసి పెరిగిపోతోంది. వాళ్ళ రాసలీలలు చూడలేక నా కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. రాధని చంపాలంటే ఒక్క క్షణం పట్టదు నాకు. కాని.... కాని.... నా చేతులతో పెంచుకొన్న మొక్కని ఎలా పీకేయను. నేను వెలిగించుకున్న దీపాన్ని ఎలా ఆర్పేయను?

అందుకే నాలో ప్రజ్వరిల్లుతున్న కోపాగ్నితో నన్ను నేనే నాశనం చేసుకోవటం మొదలెట్టేను.

అవుట్ హౌస్‌లోకి మకాం మార్చేను.

మంచినీళ్ళలా మందు త్రాగడం మొదలెట్టేను. అసలే అర్భకంగా వున్న నా ప్రేగులు ఆగలేక చిల్లులు పడిపోయేయి.

మళ్ళీ నేను హాస్పిటల్‌పాలు.

నేను చావను.

అలాగని బ్రతకలేను.

స్పెషల్ రూమ్స్ పోయి జనరల్ వార్డు పాలయింది నా శరీరం. ఇంటినుంచి వచ్చే కారియర్ పోయి, హాస్పిటల్‌వారి బ్రెడ్, పాలు తీసుకోవటానికి అలవాటుపడింది నా ఆత్మాభిమానం.

రాధ కనీసపు మర్యాదగా చూడటానికి కూడ రావడం మానేసింది.

ఎందుకొస్తుంది.

నా దగ్గర ఏముంది గనుక?

ఆమె యిప్పుడు ఆస్తికంతటికీ వారసురాలు.

తగిన ఆహారం లేక, కృంగిపోయిన శరీరంతో గుంటలు పడ్డ కళ్ళతోవున్న నన్ను భర్తగా చెప్పుకోటానికి ఆమెకు అవమానం కదా.

"మందు తీసుకోండి."

సిస్టర్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాను.

ఆమె వేపు చూసి వులిక్కిపడ్డాను.

నా వళ్ళు ఝల్లుమంది.

నల్లని ముఖంనిండా తెల్లగా కాలిన మచ్చలు!

"భగవాన్! ఎంత వికృతరూపం!"

"మై గుడ్‌నెస్! ఈ రాత్రంతా ఈ మహాతల్లిని చూడాలికాబోలు!" ఆమె అందించిన మందు గబగబా విషంలా త్రాగేసి గ్లాసు అందించేసేను.

"నిద్ర రావడంలేదా?"

"ఊహూ" అంటూ అయిష్టంగా ముఖం పక్కకి తిప్పుకొన్నాను.

ఆమె వెళ్ళిపోతున్నట్లు మెల్లిగా అడుగుల చప్పుడు.

మళ్ళీ నా కల్లోలిత హృదయ సాగరంలో తిమింగిలాల్లాంటి ఆలోచనలు.

సిస్టర్ ఒక్కో బెడ్ దగ్గరకెళ్ళి పేషెంట్సుని పరామర్శిస్తోంది. ఆవిడ రూపం

**82 కొత్త పుస్తకాలు**

**ఆదివిష్ణు**

**శివతాండవం 12-00**

ఇది నూటికి నూరుపాళ్ళ నవ్వుల నవల! సరిగమల్తో తెలుగిళ్ళకు నవ్వుల పంట అందిస్తున్న హాస్య రచయిత ఆదివిష్ణు బ్రాండు హాస్యానికి 'శివతాండవం' ఒక మచ్చు తునక

**వి. మోహన్ కుమార్**

**ఊరు అంటుకుంది 16-00**

ఒక సంఘటనపట్ల సమాజంలో విభిన్న వర్గాలు ఎలా స్పందిస్తాయో వివరంగా తెలియచేసిన నవల. నేటి రాజకీయాలకు అద్దం పట్టిన సరికొత్త సంచలనాత్మక ప్రయోగాత్మక నవల!

**యర్రంశెట్టి శాయి-చంద్ర**

**నవ్వూ-నవ్వించు-2 12-00**

అరే! 21 రూపాయలకు ముప్పయ్ లక్షల నవ్వులా! అవున్సార్! ఇందులో అబద్ధమేమి లేదు. నవ్వూ-నవ్వించు రెండు భాగాలు కొనండి ఆ రెండిట్లోనూ ఆరు వందలపైన జోకులూ-నూటపాతిక కార్టూన్లూ – కలిసి చదివి నన్నిసార్లు గుణించుకుంటే- అబ్బో నిజమే!

**కుందుర్తి ఇందిరాదేవి**

**జీవితవనంలోకొత్తగాలి 16-00**

కుటుంబంకొరకు తన బ్రతుకు ఎడారి చేసుకున్న సంధ్య, ఆమెకోసం అనుక్షణం తపించిన కిరణ్, ఆ ఇద్దరి జీవితాలతో విధి ఆడిన చెలగాటం.

పుస్తకం ధరలో 5 రూపాయలు తగ్గించి M. O. పంపితే పోస్టు ఖర్చులు మేమే భరించి ఆ 5 రూ॥లకు వి.పి. పోస్టులో పంపుతాము.

**నవసాహితి బుక్ హౌస్**

ఏలూరురోడ్డు, విజయవాడ-520 002.

-చూడగానే ఒక మాదిరిగా కోలుకొన్న పేషెంట్స్‌కి జబ్బు తిరగబెడుతుందని నా అనుమానం.

"అమ్మా, నా కొడుకుని బ్రతికించండి తల్లీ! మీ కాళ్ళట్టుకుంటాను" బొబ్బలతో వికృతంగా వున్న ఓ పిల్లవాణ్ణి భుజాన్నేసుకుని వచ్చిందో తల్లి -హృదయ విదారకంగా ఏడుస్తూ.

సిస్టర్ గబగబా అతన్ని అసహ్యం లేకుండా అందుకొంది. ఏడుస్తోన్న తల్లిని వూరడిస్తూ అతని వళ్ళంతా డెట్టాల్‌లో ముంచిన దూదితో శుభ్రం చేసి డాక్టరు చెప్పిన ప్రకారం మందురాస్తోంది. నాకు నిద్రపట్టక ఆమె చర్యలని గమనిస్తూన్నాను.

నాకు దే డ్యూటీ నర్స్ గుర్తొచ్చింది.

అందమైన హంసలా తెల్లని గౌన్‌లో ఆమెను చూసిన మొదటిక్షణం నాకెంతో ఆనందం కల్గింది.

"ఏవిటలా జంతువులా చూస్తావ్? మందు తీసుకో."

"ఏ థింగ్ ఆఫ్ బ్యూటీ యీజ్ జాయ్ ఫరాల్!చూస్తే ఏంతప్పు!" ఆమె అందమైన కళ్ళు ఎర్రబడిపోయేయి. "ఏం. పైత్యం పెరిగిపోయిందా! రోగంతో చచ్చేవాడికి కూడా సరసం!" ఆమె మందుగ్లాసు పగిలిపోయేటట్లు నా కప్‌బోర్డుమీద పెట్టి విసవిసా వెళ్ళిపోయింది.

ఇంతలో పక్క వార్డులోంచి మరో నర్సు వచ్చింది. ఇద్దరూ గుసగుసలు, పకపకలు.

"నర్స్-మా బాబు కళ్ళు తేలేస్తున్నాడు. ఒక్కసారి రావూ!"

"నర్సమ్మా, బెడ్ పాన్."

"సిస్టర్, తలనొప్పి!"

నర్స్ ఈ లోకంలో లేదు. పక్క నర్స్‌తో కబుర్లలో తేలిపోతోంది.

"సిస్టర్ నిద్ర రావటంలేదు! స్లీపింగ్ పిల్ యిస్తావా?" పిలిచేను. ఆవిడకి డిస్టర్బ్ అయినట్లుంది. కోపంగా నా వేపు చూసి "ఒక రోజు నిద్రపట్టకపోతే చావవులే" అంది విసురుగా.

నేను ఆమె జవాబుకి ఆశ్చర్యపోయేను.

"మన ఆస్థాన పేషెంటులే! సంవత్సరానికి ఆరు నెలలు యిక్కడే మకాం! వెళ్ళేప్పుడు ఓ రూపాయి కూడా యివ్వడు. పిసినారి!"

ఆమె పక్క నర్స్‌కి నన్ను పరిచయం చేస్తోంది.

నేను పిసినారినా? లక్షల ఆస్తిని ప్రేమ పేరుతో ప్రియురాలికి కైంకర్యం చేసి. రూపాయి కూడా చేతిలోలేని నిరుపేదనా?

"నిద్రమాత్ర వేసుకుంటారా? పాపం మీకు నిద్రపట్టడంలేదులా వుంది".

సిస్టర్ మాటలకి ఆలోచనల నుండి బయటపడ్డాను. ఆమె నవ్వుతూ నిలబడింది. ఇందాకటంత వికృతంగా అన్పించ లేదు!

చంద్రుడికికూడా మచ్చలున్నాయి. ఐనా ఆ సుధాకరుడు జగాన్నంతా వెన్నెలస్నానం చేయించడంలేదూ!

నేను నిశ్చింతంగా మాత్ర అందుకొన్నాను.

* * *

తెల్లవారి రెండు గంటలవుతోంది.

ఆలస్యంగా పడుకున్నానేమో- అప్పుడే మెలకువ వచ్చింది.

తెల్లని గులాబీల గుత్తితెచ్చి వాజులో పెడుతూ "హలో, హౌ ఆర్ యూ!" అంటూ నా వేపు చూసి నవ్వింది.

నేను విష్ చేసి నవ్వేను.

ముఖం కడుక్కునేందుకు బేసిన్ తెచ్చి నా ముందు పెట్టింది.

నేను ముఖం కడుక్కుంటుంటే నా ప్రక్కబట్టలు మార్చి తెల్లని బెడ్‌షీట్ వరచింది.

బ్రెడ్, పాలు నా కప్‌బోర్డు మీద వుంచుతూ "మీ వాళ్ళెవరూ లేరా?" అంది.

నా ముఖం మ్లానమయింది. దాన్ని కప్పిపుచ్చుకుంటూ "నా జబ్బు తగ్గేది కాదు. వాళ్ళని ఎన్ని రోజులని యిబ్బంది పెట్టను!" అన్నాను తెచ్చుకోలు నవ్వుతో.

"అలా నిరాశ పడవద్దు.మనకు లేని దాని గురించి ఆలోచించ కూడదు. మీకన్నా హీనదశలో వున్నవారిని చూసి మీరు ఊరట చెందాలి. అటు చూడండి. ఆ బాబుకి నిండా పదేళ్ళు లేవు. రెండు కాళ్ళూ పోలియోతో చచ్చుబడిపోయేయి. నూరేళ్ళు వికసించి బ్రతకాల్సిన పువ్వు మొగ్గలోనే వాడిపోయింది."

సిస్టర్ మాటలు ఎంతో మృదువుగా వున్నాయి.

"మే అయ్ నో యువర్ నేమ్ సిస్టర్."

సిస్టర్ నవ్వింది -"పేరా? పిలుచుకోవటానికి పెద్దవాళ్ళు పెట్టిన పేరు అవహేళవపాలయింది. ప్రస్తుతం నన్‌గా మారేక నా పేరు మెర్సీ."

"యూ ఆర్ రియల్లీ మెర్సీ."

"థాంక్యూ!" అంటూ సిస్టర్ మరో పేషెంటు దగ్గరి కెళ్ళిపోయింది.

అక్కడ కూడ అదే ప్రేమ! అదే పలుకరింపు! అదే అనురాగం! మూర్తీభవించిన ప్రేమమూర్తిలాంటి ఆమె మూడు రోజుల్లోనే వార్డుకి ఆప్తబంధువై పోయింది.

"సిస్టర్, దేసైమ్ నర్స్ ఏమయింది?" అడిగేను.

"ఎవరూ ? శ్యామలా ? ఆమె మేరేజ్. పదిహేను రోజులు శెలవు పెట్టింది."

"పాపం ఎవరో దురదృష్టవంతుడు" అన్నాను.

"ఎందుకని?" అమాయకంగా అడిగింది మెర్సీ.

"అబ్బాఏంకోపం! తారాజువ్వ" అన్నాను.

"చైల్డిష్ గాల్. యింకా ప్రపంచం తెలియదు" అంది జాలిగా.

"సిస్టర్ నువ్వెందుకు నన్‌గా జేరేవు ?"

"పేషెంట్సుకి స్వవిషయాలు చెప్పి బాధ పెట్టకూడదు" అంది చిరునవ్వుతో.

"సారీ" అన్నాను.

"ఫర్వాలేదు. నేను వివాహం చేసుకుంటే మీలాంటి పీడిత సోదరులకి సేవ చేసే అదృష్టం పోతుందని" సిస్టర్ వెళ్ళిపోతూ అంది.

* * *

"సిస్టర్!"

"ఎస్!"

"ఈ ఫోన్ నెంబర్‌కి ఒక్కసారి ఫోన్ చేసి రాధను రమ్మంటావా?"

"రాధ!" అంది మెర్సీ ఎటో ఆలోచిస్తూ.

"ఎస్! షి యీజ్ మై వైఫ్."

"ఆల్ రైట్!" అంటూ వెళ్ళి పది నిముషాల్లో వచ్చింది.

"ఆమె మీ వైఫా ?"

"ఏం ?"

"ఏం లేదు. ఆమె సాయింత్రం తనే రావాలనుకుంటున్నారట! తప్పక వస్తానని చెప్పేరు. బి హేపీ!" అంటూ వెళ్ళిపోయింది.

నేను అపనమ్మకంగా చూసేను.

రాధ అంత తేలిగ్గా వస్తానంటుందా? నేను బాధ పడ్తానని సిస్టర్ అబద్ధం చెప్పలేదుకదా?

నా ఆలోచనలలో నేనుండగానే నాలుగయింది. విజిటర్స్ ప్రవాహంలా వస్తున్నారు.

నేను నిర్లిప్తంగా బెడ్‌మీద కూర్చుని చూస్తున్నాను.

నేను అనుకోని రీతిలో— ఊహించని విధంగా రాధ వచ్చింది.

"థాంక్యూ రాధా! రమ్మనగానే వచ్చేవు! కూర్చో!" అన్నాను సంతోషంగా.

రాధ నవ్వకుండా కుర్చీలో కూర్చొని "నేనే రావాలనుకుంటున్నాను" అంది.

"నిజంగానా ?" అన్నాను ఆనందంగా.

"అవును" అంది పాలిష్ చేసిన గోళ్ళ వేపు చూసుకొంటూ.

కాస్సేపు మా యిద్దరి మధ్యా మౌనం. మెర్సీ వార్డులో తిరుగుతూ మమ్మల్ని గమనిస్తోంది.

రాధ వున్నట్టుండి బేగ్‌లోంచి కొన్ని కాగితాలుతీసి నా ముందుంచి "సంతకాలు పెట్టండి" అంది.

నేను అనుమానంగా వాటిని అందుకొని చదివి దిగ్భ్రమ చెందేను. వెంటనే కోపంతో వణికిపోతూ, "నెవ్వర్! నేను సంతకం చేయను!" అంటూ పరపరా చింపేసేను.

రాధ నిర్లక్ష్యంగా నవ్వి లేచి నిలబడింది.

"మరేం ఫర్వాలేదు. ఎలా మీనుండి డైవోర్సు తీసుకోవాలో నాకు తెలుసు! అనారోగ్యపు భర్తతో కాపురం చేయమని ఏ 'లా' చెప్పదు. మహేష్‌కూడ వాళ్ళ భార్యకి డైవోర్సు యిస్తున్నాడు. త్వరలో మేము పెళ్ళి చేసికోవటం తూర్పున సూర్యుడు వుదయించినంత సత్యం! బై!" అంటూ వెళ్ళిపోయింది.

మెర్సీ మెల్లిగా నా దగ్గర కొచ్చింది.

"డోంట్ బి ఎక్సైటెడ్, మీరు జబ్బు మనిషినని మరచిపోతున్నారు" అంది.

"నా కింకేం మిగలలేదు సిస్టర్! జీవితంలో చిత్తుగా ఓడిపోయేను! వున్న ఆస్తినంతా ప్రేమ పేరుతో ఈ పిశాచం పాలు చేసేను. ఇది అందమైన రూపంలో వున్న రాక్షసి! డెవిల్!" అంటూ జుట్టు పీక్కున్నాను.

"ఇలా బాధపడితే ఏం ఒరుగుతుంది? పెద్దవాళ్ళని శాయశక్తులా మార్చడానికి ప్రయత్నించాలి! అలా కాని పక్షంలో వాళ్ళకి దూరంగా వుండాలి! అంతే కాని యిలా కృంగిపోకూడదు!"

"దానిసంగతి మీకు తెలియదు! అది నన్ను వెధవనిచేసి చిప్పచేతికిచ్చింది."

"మీపేరు కృష్ణ కదూ!" అంది మెర్సీ.

"అవును" అన్నాను నిర్లిప్తంగా.

"పంకజం గుర్తుందా ?"

"ఏ పంకజం ?"


"బి.ఎస్‌సి.లో మీ క్లాస్‌మేట్. కేవలం భగవంతుడి చిన్నచూపువల్ల అంద విహీనంగా పుట్టిన నేరానికి, మీ అందరి చేతా 'పంకం' అని పిలవబడి హేళన పాలయిన పంకజం."

నేను మెర్సీ ముఖంలోకి గుచ్చిచూసేను. నాకేదో గుర్తొస్తూంది.

"నేను ప్రస్తుతం సమాధి చేయబడిన గతంలో పంకజాన్ని!" అంది.

నేను మాట్లాడలేనట్లు చూస్తున్నాను.

"తనకేమీ హాని చేయని నా జీవిత ధ్యేయాన్ని తారుమారు చేస్తూ నా బ్రతుకుని నాశనం చేసిన రాధని నేను మనస్ఫూర్తిగా క్షమించినప్పుడు మీరెందుకామెను క్షమించలేరు? ఆమె జీవితాన్ని ఆమెకి వదలి మీరు నిశ్చింతగా వుండండి. ఆమె యిప్పుడు పల్లానికి పరిగెడుతూన్న చక్రం. వెళ్ళి వెళ్ళి ఎక్కడో ఢీకొని ఒరిగిపోతుంది. అప్పుడు



## సెక్స్–సెన్సార్



ఓ నిర్మాత సెక్సప్పీలు సినిమాలు మాత్రమే తీస్తాడు. ఒకాయనకి ఓ అనుమానం వచ్చి నిర్మాత దగ్గరకు వెళ్ళాడు. "ఇందరు సెక్స్‌తారలతో మీరు సినిమాలు తీస్తున్నారు కదా! మీకు నిద్రెలా పడుతుందండీ! వాళ్ళు కలలో రారా?" అన్నాడు.

"వాళ్ళు రారు— వస్తే బాగానే ఉండేది. సెన్సారు వాళ్ళు వస్తుంటారు" అన్నాడా నిర్మాత దిగులుగా.

—బద్దిగం పాండురంగారెడ్డి, కరీంనగర్

గాని ఆమెకి పరివర్తనరాదు." అంటూ వెళ్ళిపోయింది మెర్సీ.

పంకజం:

నల్లగా, సన్నగా వుండే పంకజం బి.ఎస్.సి.లో రాధతోపాటే వచ్చి చేరింది. రాధపక్కనే కూర్చునేది! అందమైన రాధ పక్కన కూర్చోవటం వల్లనేమో— ఆమె మరీ వికారంగా అనిపించేది.

ఎలాంటివాళ్ళకైనా పేర్లుపెట్టే మావాళ్ళు ఆమెని "పంకం" అని పిలిచేవారు! ఆమెకిష్టమైనేది కాదు పాపం.

అందాన్ని తప్ప అంతరంగాన్ని చూడలేని వయసది. రాధని వలలో వేసుకోవడానికి ఒక తమాషా చేసేను నేను.

పంకజంపేరున ఓ ప్రేమలేఖ వ్రాసేను. నా మీద ఆశలు పెంచుకొంటున్న రాధ అది చూసి అసూయపట్టలేక పంకజంతో దెబ్బలాడింది. నాకేంతెలియదని పంకజంచెప్పినా ఆమెలో అగ్ని చల్లారలేదు.

ప్రాక్టికల్ చేస్తుండగా పక్కనే వున్న పంకజం మొహాన్న సల్ఫ్యూరిక్ ఆసిడ్ బాటిల్ విసిరేసింది.

పంకజం పెట్టిన కేకలకి అందరం చుట్టూ చేరేం!

పంకజం నోరు మెదపలేదు.

రాధ అలా చేయడం చూసినవాళ్ళున్నా పంకజం మాత్రం అది తన పొరబాటుగానే చెప్పింది.

ఆ రోజున రాధ చేసిన దుశ్చర్య ప్రేమ మైకంలోవున్న నాకు తప్పుగా కనపడలేదు. పైగా 'నా కోసమే' అన్న గర్వం కూడ కల్గింది.

తర్వాత పంకజం ఏమయిందో మాకు తెలియదు.

తిరిగి ఈనాడు మెర్సీగా ఆమెని చూడడంతో నాహృదయం పశ్చాత్తాపంతో కృంగిపోయింది.

"మెర్సీ! నన్ను క్షమించు. నీకు చేసిన అన్యాయమే నాకీనాడుశాపమైంది" అన్నాను ఆవేదనగా మందుతెచ్చిన మెర్సీతో.

మెర్సీ నవ్వింది చాల సాధారణంగా. ఆ నవ్వులో హేళనగాని, బాధగాని, వెటకారంగాని లేవు. "మీ బాధ మరచిపోవాలని

"మనసున్న ప్రతి మనిషికీ అంకితం" —రచయిత్రి

నా సంగతి గుర్తుచేసేను. ఎవరు ఎవర్ని క్షమించగలరు. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదని మీకు కూడ తెలుసు. ఎందుకూ పనికిరాని రూపం వుంటేనేం? పూడితేనేం? నాకు సేవచేసేందుకు రెండు చేతులున్నాయి. ప్రేమతో చూసేందుకు రెండు కళ్ళున్నాయి. తీయని మాటలుచెప్పి వూరించడానికి నోరుంది. వీటితో సాటి పీడిత జనానికి నేను ఎంతైనా సేవ చేయగలను! నాకెలాంటి దిగులూ లేదు. అయామ్ హేపీ!" అంది హాయిగా నవ్వుతూ.

నేను మౌనంగా ఆ దేవతని చూస్తున్నాను.

తెల్లని దుస్తులలో దేవతలా కదలివెళ్తున్న ఆమెని నా హృదయం ఎలుగెత్తి పిలిచింది.

"అందమంటే నువ్వే!"

(సమాప్తం)

